క్లుప్తంగా

జీవీఆర్ దంపతులకు సత్కారం



జీవీఆర్ దంపతులను సత్కరిస్తున్న ప్రచార సమితి సభ్యులు

డాబాగార్డెన్స్: భగవద్గీత వైభవాన్ని నలు దిశలా చాటి చెబుతున్న ఏకైక సంస్థ వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతాప్రచార సమితి. గీతా ప్రచార సమితికి గత 25 ఏళ్లకు పైగా నిస్వార్థ సేవలు అందించిన జీవీఆర్ ప్రసాద్ లక్ష్మీనరసింహ దంపతులను మంగళవారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గీతా ప్రచార సమితి తరపున సత్కార కార్యక్రమం నిర్వహించారు. గీతా ప్రచార సమితి చేపడతున్న సేవా కార్యక్రమాలకు సేవలందించిన జీవీఆర్ ప్రసాద్‌ను ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు ఈ సందర్భంగా కొనియాడారు. భవిష్యత్‌లో కూడా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, కోశాధికారి వనజాదేవి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఆధార్ నమోదు



లయోలా హోంలో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

అల్లిపురం: పెందుర్తి లయోలా ఓల్డేజ్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న 120 మంది అనాథలకు ఆధార్ నమోదు కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఆధార్ కార్డులు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిసిన మమత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మమత.. లయోలా హోమ్ చైర్మన్ ప్రకాశరావులు సంయుక్తంగా హోమ్‌లో ఆధార్ సేవా కేంద్రం మేనేజర్ ఎస్. బాలసుబ్రమణ్యం, ఆపరేషన్ మేనేజర్ వి.వేణుగోపాల్ సహకారంతో ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశారు. 120 మందికి ఆధార్ నమోదు చేసినట్లు మమత తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

మహారాణిపేట: ప్రభుత్వ నర్సులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అన్నారు. ఇటీవల శిశువు మృతిచెందడం, ద్విచక్రవాహనంపై మృత శిశువును తల్లిదండ్రులు తరలించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో కేజీహెచ్ నర్సును సస్పెండ్ చేసిన నేపథ్యంలో సూపరింటెండెంట్ కేజీహెచ్‌లోని నర్సులతో సమావేశం ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో నర్సులు నిర్లక్ష్యం చూపించవద్దని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవ, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను జరిపించారు.

18న కంప్యూటర్ సైన్స్ ఫ్రెషర్స్ డే

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాల ఫ్రెషర్స్‌డే వేడుకలను వచ్చే నెల 18న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విభాగాధిపతులు ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు



పోతురాజు స్వామి పుట్ట



ఎల్లమ్మ దేవాలయం

డాబాగార్డెన్స్: భక్తులకు కొంగుబంగారంగా పూజలందుకుంటున్న ఎల్లమ్మ జాతర వార్షిక ఉత్సవాలు ఈ నెల 28, మార్చి ఒకటి తేదీన పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 28న తొలేళ్ల ఉత్సవం, మార్చి ఒకటిన జాతర జరపనున్నారు. మహాశివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పులవీధి జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, దర్శనాలు, ఉదయం నుంచి మాలధారణ



ఎల్లమ్మ పుట్ట..

భక్తులు శూలాల ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం అగ్నిగుండం తొక్కుతారు.

ఏడుగురు అక్కాచెల్లెళ్లకు ఒకే సోదరుడు

ఎల్లమ్మ, అనకాపల్లి నూకాలమ్మ, గంగాలమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ, బంగారమ్మ, పోలమ్మ అమ్మవార్లకు పోతురాజు ఒక్కడే అన్నదమ్ముడు. ఎల్లమ్మతోటలోని అమ్మవారి దేవాలయానికి సమీపంలో పోతురాజు పుట్ట ఉంది. ఈ ఆలయానికి పోతురాజు పుట్టకు సొరంగా మార్గం ఉందని పూర్వీకులు చెబుతున్నారు. ఈ ఎల్లమ్మ పేరునే ఆ ప్రాంతాన్ని ఎల్లమ్మతోటగా పిలుస్తున్నారు. ఆలయానికి 80 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని పెద్దలు చెబుతున్నారు.

ఆలయ చరిత్ర..

చిత్రాలయ థియేటర్ సమీపంలో కొన్నేళ్ల కిందట ఓ బావిలో ఎల్లమ్మవారు, సోదరుడు పోతురాజు విగ్రహాలు బయటపడ్డాయి. విగ్రహాలను బయటకు తీసి, మామిడి చెట్టు ఉన్న తోటలో ప్రతిష్ఠించారు. 1960లో సంభవించిన తుపానుకు ఆలయం కూలిపోయింది. అనంతరం నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ అమ్మవారు ఆ తోట పేరు మీద ఇప్పటికీ ఈ ప్రాంతాన్ని ఎల్లమ్మతోటగా పిలుస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజున సముద్ర స్నానం చేసి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటే సర్వ రోగాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

వైభవంగా నీలమాంబేశ్వరి అమ్మవారి పరస



నీలమాంబేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విశేష అలంకరణలో నీలమాంబేశ్వరి అమ్మవారు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట, యాతపేటరోడ్డులో వెలసిన నీలమాంబేశ్వరి అమ్మవారి వార్షిక పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని యాతపేట, కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట, జెండాచెట్టు తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. నీలమాంబేశ్వరి అమ్మవారి ప్రధాన పండగ సందర్భంగా సాయంత్రం పులి వేషాలు, తప్పిటగుల్లు, నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రేలా రే రేలా, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రావూస్ సెక్రటరీ పిల్లి రమణి, పట్నాల గురుమూర్తి, రాథోడ్ సన్స్ సహకారంతో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు, కమిటీ సభ్యులు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న సహస్ర తులసి పూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 23న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నా మని ఆలయ కార్య నిర్వహణాధికారి శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనే దంపతులు రూ.1500 చెల్లించాలని ఆమె పేర్కొన్నారు.

కోలా గురువులకు అభినందనలు



కోలా గురువులను అభినందిస్తున్న పలువురు మత్స్యకార సంఘాల నాయకులు



కోలా గురువులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీవత్సవ్

మహారాణిపేట/డాబాగార్డెన్స్: శాసన మండలి సభ్యుల ఎంపికలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సామాజిక సమతుకాన్ని పాటించారని పలువురు మత్స్యకార సంఘాల నాయకులు బర్రి కొండబాబు, పీసీ అప్పారావు అన్నారు. ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులకు ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంపై మంగళవారం గురువులను కలిసి అభినందించారు. కోలా గురువులను అభినందించిన వారిలో కుంజుమాన్, వి.యల్లజీరావు, వి.ప్రసాద్, జి.గరగయ్య, ఎస్.నరసింగు,బి.అనిల్ తదితరులు ఉన్నారు.

మర్యాద పూర్వక కలయిక

కోలా గురువులును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కోలాను కలిసిన వారిలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, మాజీ కార్పొరేటర్ జగ్గపల్లి అప్పలరాజు ఉన్నారు.

ప్రతీ నలుగురిలో ఒకరికి అధిక రక్తపోటు

డాబాగార్డెన్స్: ప్రతీ నలుగురిలో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడతున్నారని ఎయిమ్స్ రిషికేష్, డాక్టర్ ప్రదీప్ అగర్వాల్ తెలిపారు. హైపర్ టెన్షన్ నిశబ్ద అంటువ్యాధని పేర్కొన్నారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 5 ప్రకారం అధిక రక్తపోటు ఉన్న వారిలో కేవలం 7 శాతం మంది స్త్రీలు, 6 శాతం మంది పురుషులు మాత్రమే సాధారణ మందులు వాడుతున్నారని చెప్పారు. చికిత్స చేయకుండా వదిలేస్తే ఆకస్మిక, అకాల మరణాలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. క్రమం తప్పకుండా పరీక్షించక పోయినట్టయితే ప్రమాదకరమైన ఈ రక్తపోటును గుర్తించడం కష్టమేనన్నారు. హైపర్‌టెన్షన్‌కు చికిత్స చేయకుండా వదిలేస్తే ఆకస్మిక స్ట్రోక్, గుండెపోటు, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులకు కారణం అవుతుందని చెప్పారు.

తాగునీటి బోరును ఇసుకతో కప్పేశారు



ఇసుకలో కూరుకుపోయిన బోరింగ్

అల్లిపురం: పది మందికి పనికివచ్చే తాగునీటి బోరును గృహ నిర్మాణదారులు ఇసుకతో కప్పేసిన వైనం 33వ వార్డులో చోటు చేసుకుంది. వార్డులో నారాయణవీధిలో ఒక గృహ నిర్మాణదారు పనిచేసే పబ్లిక్ బోరును ఇసుకతో కప్పేసినా సచివాలయ సిబ్బందిగాని, జీవీఎంసీ సిబ్బందిగాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, పబ్లిక్ ప్రాపర్టీలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

2 నుంచి సీతారాముల వార్షిక కల్యాణోత్సవాలు



సీతారాముల కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై ఉన్న ప్రాచీన రామాలయంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 2వ తేదీన అంకురార్పణ, 3న సాయంత్రం 5గంటలకు స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం జరుగుతాయని తెలియజేశారు. భక్తులు, గ్రామస్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వాసవీ క్లబ్ సభ్యురాలికి ఆర్థిక సహాయం



చెక్కు అందజేస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం: వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ క్లబ్ సభ్యురాలు కొట్యాడ శ్రీదేవి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబానికి 32వ వార్డు కార్పొరేటర్, వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కందుల నాగరాజు మంగళవారం పరామర్శించి రూ.3.28 లక్షలు ఆర్థిక సాయాన్ని వాసవీ క్లబ్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్యాడ శ్రీదేవి వాసవీ క్లబ్‌కు ఎంతో సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ మహేశ్వరరావు, వాసవీ క్లబ్ విజన్స్ ప్రెసిడెంట్ గ్రంథి దేవి, ముక్కు శ్రీనివాస్, వీవీ గుప్తా పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు చికిత్స, ఆశ్రయం



చికిత్స అనంతరం వసతి గృహంలో..



గోపాలపట్నం రైల్వే స్టేషన్‌లో మతిస్థిమితంలేని మహిళను తరలిస్తున్న ఏయూటీడీ సిబ్బంది (ఫైల్)

అల్లిపురం: ఆమె ఎవరో తెలియదు..ఎక్కడ నుంచి వచ్చిందో సమాచారం లేదు. పేరూ..ఊరూ తెలియదు. మతిస్థిమితం కోల్పోయింది. ఏడాది క్రితం గోపాలపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో సంచరిస్తుండగా పోలీసులు గుర్తించారు. నాటి సీఐ ఆధ్వర్యంలో ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. ఆమెను టీఎస్ఆర్, జీవీఎంసీ ఏయూటీడీ షెల్టర్‌కు తరలించారు. అక్కడ సపర్యలు చేసి గత ఏడాది ఫిబ్రవరి 17న చినవాల్తేరులోని మెంటల్ కేర్ ఆస్పత్రికి తరలించారు. నాటి నుంచి అక్కడే ఆమె చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం నయం కావడంతో తిరిగి టీఎస్ఆర్, జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తరలించారు. ఆమె తన గతాన్ని గుర్తు చేసుకుంటోందని, త్వరలోనే ఆమె అడ్రస్, కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకుని వారికి అప్పగిస్తామని మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

జాబ్ డ్రైవ్‌లో మహిళా కళాశాల విద్యార్థినుల సత్తా



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్

డాబాగార్డెన్స్: ఇటీవల నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్‌లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. సుమారు 66 మంది విద్యార్థినులు ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో ట్వంటీ ఫోర్ సెవెన్ డాట్ ఏ1 సహకారంతో ఇటీవల జాబ్ డ్రైవ్ నిర్వహించారు. మెగా జాబ్ డ్రైవ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో 358 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆన్‌లైన్‌లోనే అర్హత పరీక్ష నిర్వహించారు. వీరిలో 185 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ అర్హత పరీక్ష సాధించారు. అనంతరం నిర్వహించిన రాతపరీక్షలో 66 మంది విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థినులను అభినందించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. మెగా జాబ్ డ్రైవ్‌ను జేకేసీ కో ఆర్డినేటర్ డి.అరుణపద్మ, జేకేసీ మెంటార్ వీఎస్ రాజు నిర్వహించారు.

సుబ్బారెడ్డితో ఎమ్మెల్యే వాసుపల్లి భేటీ



వైవీ సుబ్బారెడ్డితో నియోజకవర్గ అభివృద్ధిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజవర్గం అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

గౌడ్‌లకు అవకాశం కల్పించండి

రాజకీయంగా గౌడ కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వైవీ సుబ్బారెడ్డిని ఉత్తరాంధ్ర గౌడ సంఘం సభ్యులు వినతి పత్రంఅందజేశారు. వైవీ సుబ్బారెడ్డిని కలిసిన వారిలో ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కామన సుబ్బారావు, ఉత్తరాంధ్ర జిల్లాల గౌడ సంఘం గౌరవాధ్యక్షుడు మార్గాని రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరువ గణేష్, మార్గాన చిన్నబాబు, విజయ్‌కుమార్, అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

వైవీకి సత్కారం

అల్లిపురం: టీటీడీ చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ని నీలమ్మవేప చెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డిలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డిని సత్కరించారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన వచ్చింది. ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. 39వ వార్డు లక్ష్మీ టాకీస్ బస్టాప్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఇల్ల స్థలాల హామీ పత్రాలు ఇచ్చినప్పటికీ కొన్ని కారణాల వల్ల స్థలాలు రాలేదని వచ్చిన ఫిర్యాదును ఎమ్మెల్యే స్పందించారు. వారి కోసం మూడో దఫాలో మంజూరు చేయాలని జీవీఎంసీ అధికారులను కోరారు. అలాగే నిరుద్యోగ యువకులు జీవీఎంసీ శానిటేషన్, ప్రైవేట్ జాబ్స్ కల్పించాలని వినతి పత్రాలు అందజేశారు. కొన్ని కారణాలు వల్ల పెన్షన్ కోల్పోయిన వారికి రోల్ బ్యాక్ చేయాలని అధికారులను ఆదేశించారు. పెన్షన్స్, కరెంటు మీటర్లు, ప్రాపర్టీ ట్యాక్స్ మార్పుల కోసం వచ్చిన వినతులను జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు అలపున కనకరెడ్డి, 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపి, దక్షిణ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ నాయకుడు బోని దేవా, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులతో పాటు ఆర్థిక సాయం కోసం వచ్చిన వారిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదుకున్నారు. తన సొంత నిధుల నుంచి రూ.12వేలు ఆర్థిక సాయం అందించారు. అన్నదానం కోసం రూ.10వేలు అందజేశారు. అలాగే 38వ వార్డు టౌన్‌కొత్తరోడ్డు పంజా జంక్షన్‌లో నివశిస్తున్న కారి దాలయ్య కుమార్తె ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో చదువుతోంది. ఆ బాలికకు ఒక్కోసారి అకస్మాత్తుగా కల్లు మూతపడి చూపు కష్టతరమవుతుందని కుటుంబ సభ్యుల వినతి మేరకు ఎమ్మెల్యే స్పందించారు. బాలిక టెస్ట్‌లకయ్యే నగదును అందజేశారు.


ఘనంగా మాతృభాషా దినోత్సవం



మాతృభాష విశిష్టతను తెలుపుతున్న విద్యార్థిని

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ మాతృభాష ఆవశ్యకత, మాతృభాష నేర్చుకోవడం వల్ల ఉపయోగాలను వివరించారు. కళాశాల హిందీ, తెలుగు విభాగాలు, ఐక్యూఏసీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ కె సుధ, తెలుగు విభాగధిపతి ఎన్‌వీ పద్మకుమారి, రాధమ్మ, ఆంగ్ల విభాగాధిపతి జె.సునీత, బి.శాంతి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి.అరుణపద్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. స్వామి నిత్య కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణ మహోత్సవాన్ని మంగళవారం నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

అనిశ్చిత పరిస్థితులను సమర్థంగా అధిగమించాలి



రాగూర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించి రాణించే నైపుణ్యాలను యువతరం పెంపొందించుకోవాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఏయూ డీసీఎంఎస్ విభాగంలో నిర్వహించిన ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం, జాతీయ మేనేజ్‌మెంట్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం సమాజం మారుతుంటుందని, దీనిని తెలుసుకుని తదనుగుణంగా నైపుణ్యాలతో సుసంపన్నం కావాలన్నారు. అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్-హెచ్ఆర్ డాక్టర్ పి.శ్రీనివాస్ రాగూర్ మాట్లాడుతూ సంక్లిష్ట సమయాలలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. మార్పును స్వాగతిస్తూ ముందుకు సాగే వారు నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. నిరంతరం అభ్యసనం దీనికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. మైలాన్ లేబొరేటరీస్ హెచ్ఆర్ విభాగాధిపతి జి.సరస్వతీరావు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విశాఖపట్నం మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వీఎంఏ సభ్యులు, డీసీఎంఎస్ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.